# ఎఫ్‌ట్రానిక్స్ వెలుగు రామకృష్ణ

**స్వయంకృషి, పట్టుదల,** సృజనతో పాటు వ్యాపార పటిమ కలగలసిన అద్భుత వ్యక్తిత్వమే ఎఫ్‌ట్రానిక్స్ రామకృష్ణ. సాధారణ కుటుంబం నుంచి దేశం గర్వించదగిన సాంకేతిక నిపుణుడిగా, పారిశ్రామికవేత్తగా ఎదిగి బెజవాడకే వన్నెతెచ్చారు. అధునిక సాంకేతికతకు ప్రతిబింబంగా నిలిచిన ఎల్ఈడీ బోర్డులు... లైట్లు... రైల్వేలో సంచలనం సృష్టించిన డేటా లాగర్లు... బ్లాక్ ఇన్‌స్ట్రుమెంట్లు... రామకృష్ణ సృష్టించిన ఉత్పత్తులే. ఎందరికో ఉపాధి బావుటాగా నిలిచిన ఆయన ప్రస్థానం గురించి రేఖామాత్రంగా...




విజయవాడ, న్యూస్‌లైన్ ప్రతినిధి :

ఆధునిక సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఆవిష్కర్తల గురించి మనం చదువుతుంటాం.. వింటుంటాం.. వారి ప్రతిభను, ప్రత్యేకతలను తెలుసుకుని ఆశ్చర్యపోతుంటాం. అలాంటి ఓ వ్యక్తి మనతోపాటే మన మధ్య ఉంటే.. అది ఓ అద్భుతమేకాదు మనకు, భవిష్యత్తు తరాలకు ఓ వరం.. ఓ స్ఫూర్తి. నగరం కేంద్రంగా ఎఫ్‌ట్రానిక్స్‌తో అంతర్జాతీయ మార్కెట్‌ను శాసిస్తున్న అరుదైన పారిశ్రామిక దిగ్గజం దాసరి రామకృష్ణ. పుట్టింది గుంటూరు జిల్లా బ్రాహ్మణ కోడూరులోనైనా.. ఆయనలోని సాంకేతిక ప్రతిభ, విలక్షణ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దింది.. పదునుపెట్టింది మాత్రం బెజవాడ నగరమే. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆయన బాల్యంలో రైస్ మిల్లు, ట్రాక్టరుతో గడపడమే ఆయన దృష్టి సాంకేతిక రంగం వైపు మళ్లించింది. అదే ఆయనను ఇంజినీరును చేసింది. గుంటూరు ఏసీ కాలేజీలో ఇంటర్, సూరత్ ఆర్ఈసీలో ఇంజినీరింగ్, చెన్నై ఐఐటీలో ఎంటెక్ చదివారు. ఆ తర్వాత సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో రెండున్నరేళ్లు అధ్యాపకుడిగా పనిచేశారు.



దానిలో ఆయన సంతృప్తి కలగలేదు. తన తపన, లక్ష్యం వేరే ఉందని గుర్తించారు. ఉద్యోగాన్ని వదులుకుని వ్యాపారంలోకి అడుగుపెట్టారు. పక్కా వ్యాపారంగాకుండా తన సాంకేతిక ప్రతిభకు పదును పెట్టి సమాజానికి మేలు చేసే ఎలక్ట్రానిక్ పరికరాలు కనుగొన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో తన ముద్రవేశారు. దాదాపు 500మందికి ప్రత్యక్షంగా ఉపాధి చూపుతున్నారు. 'అన్నింటికీ మించి దేశానికి ఉపయోగపడే పరికరాలు అందించినందుకు సంతృప్తిగా, గర్వంగా ఉంది' అంటారాయన. కళాశాలలో పనిచేసే సమయంలో ఏదైనా ఫంక్షన్ జరిగితే దానికి డెకరేషన్ టీమ్ వేసేవారు. అందులో రామకృష్ణ కూడా సభ్యులుగా ఉండేవారు. ఇంజినీరింగ్ చదివి కూడా కాగితాలతో డెకరేషన్ చేయడమేమిటని ఆలోచిస్తే ఎల్ఈడీ ఆలోచన వచ్చింది. అప్పటివరకు దేశంలో ఎక్కడా ఎల్ఈడీ బోర్డులు లేవు. దీంతో కళాశాల ఉద్యోగానికి గుడ్‌బై చెప్పి ఇద్దరు స్నేహితులతో కలిసి 1985 డిసెంబర్‌లో నగరంలోని బృందావనకాలనీలో ఎఫ్‌ట్రానిక్స్‌ను సంస్థను ప్రారంభించారు రామకృష్ణ. ఎల్ఈడీ బోర్డులు తయారు చేయటం మొదలుపెట్టారు. మొదట్లో ప్రకటనల కోసం దీన్ని ఉపయోగించారు. రూ. 50వేలతో ప్రారంభమైన సంస్థ నేడు 500మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తూ ఏడాదికి రూ. 50కోట్ల టర్నోవర్ చేరుకుంది. కృష్ణా యూనివర్శిటీలో ఎమ్మెస్సీ ఇన్‌స్ట్రుమెంటేషన్ కోర్సుకు రామకృష్ణ స్పాన్సర్ చేస్తున్నారు. కేఎల్, విజ్ఞాన్ యూనివర్శిటీ నుంచి వస్తున్న 500 మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఏర్పాటుచేస్తూ దేశ సంపద పెరుగుదల కారకులవుతున్నారు.

## కొత్త ఉత్పత్తులకు శ్రీకారం

రామకృష్ణ తొలుత మార్కెట్‌లో లేని కొత్త ప్రొడక్టును ఎంచుకున్నారు. మరే కంపెనీ ఈ తరహా ప్రొడక్టును తయారు చేయకపోవటంతో రెస్పాన్స్ బాగానే వచ్చింది. సంస్థ నుంచి వెలువడిన డేటాలాగర్లు రైల్వేలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. ప్రమాదాలను తగ్గించటమే కాకుండా సిబ్బందిలో క్రమశిక్షణ పెంచటానికి కారణమయ్యాయి. గతంలో ప్రమాదం జరిగితే సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలిస్తేగానీ కారణం తెలిసేది కాదు. డేటాలాగర్ల వల్ల ప్రమాదాలను కనిపెట్టడమే కాకుండా ప్రమాదం జరిగితే ఎందువల్ల జరిగింది అన్న విషయాన్ని వివరిస్తుంది. దేశంలో నాలుగున్నర వేల రైల్వేస్టేషన్లలో వీటిని ఉపయోగిస్తున్నారు.

### లాభాల ఆశ లేదు

చిన్నతనం నుంచి స్వతంత్ర భావాలు అలవడటం నా పురోగతికి కారణం. పెద్దగా సంపాదించాలనే కోరిక లేదు. అందుకే రిస్క్ తీసుకుని ఉద్యోగం మానేసి పరిశ్రమ పెట్టాను. మనం అందించే వస్తువు వినియోగదారుడు ఇచ్చే ధరకు తగిన విలువను అందిస్తుందా, లేదా అన్నది చూడాలి. కోట్లాది రూపాయల లాభాలు ఆర్జించాలనే ఆత్యాశ లేదు. ఇదే వ్యాపారంలో కొనసాగుతాను. తరువాత తరానికి ఈ వ్యాపారాన్ని అందించటానికి నా కుమారుడు అన్వేష బీటెక్ చేసి ఇక్కడే పనిచేస్తున్నాడు.

– డి.రామకృష్ణ
ఎఫ్‌ట్రానిక్స్ అధినేత